కనీస వేతనాలు అమలు చేయాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో డిమాండ్స్ డే
- తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

కాజులూరు: కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసి వారిని ఆదుకోవాలని ఏపీ కౌలు రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. బుధవారం కాజులూరు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో రాజబాబు తదితర నాయకులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతుందన్నారు. గతంలో తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఐసీడీఎస్‌ను సంస్థాగతం చేసి స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సంఘ నాయకులు డి.సునీత, ఎస్.మంగాదేవి, ఎం.కుమారి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.


కాజులూరులో ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

రామచంద్రపురంలో..

రామచంద్రపురం: దేశవ్యాప్తంగా సీఐటీయూ పిలుపులో భాగంగా డిమాండ్స్ డే ని పురస్కరించుకుని స్థానిక పాత బస్టాండ్ నుంచి తహసీల్దార్ ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, మండల సీఐటీయూ కన్వీనర్ ఎం.దుర్గమ్మ మాట్లాడుతూ లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని, ప్రైవేటీకరణను, జాతీయ నగదు బదిలీకరణ పథకాలను ఆపాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశ, మిడ్డే మీల్స్, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్ర శిక్ష, వెలుగు, మెప్మా, ఉపాధి హామీ, సేంద్రియ వ్యవసాయం, 108, 104 తదితర అన్ని పథకాల కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనాలు, పింఛన్ లాంటి సామాజిక భద్రత సౌకర్యాలు కల్పించాలన్నారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు నిర్ణయించి అమలు చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను తిరిగి ప్రారంభించాలని, ఇప్పటివరకు ఉన్న పెండింగ్ క్లెయిమ్‌ల పరిహారాలు తక్షణమే చెల్లించాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ నాయకులు సూర్యకుమారి, జహీరా, దుర్గా, విజయలక్ష్మి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: మండల కేంద్రమైన కె.గంగవరంలో బుధవారం అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా కార్యకర్తలు తమ డిమాండ్లు పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని, సమ్మె కాలంలో ప్రభుత్వ ఒప్పందం ప్రకారం జీవో నంబర్ 47ను మార్పు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తదితర అంశాలను వెంటనే ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందించారు.



రామచంద్రపురంలో ర్యాలీ చేస్తున్న సీఐటీయూ నేతలు, కార్మికులు

కదం తొక్కిన కార్మికలోకం

రాయవరం: దేశవ్యాప్త డిమాండ్స్ డే పిలుపులో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో అసంఘటిత రంగ కార్మికులు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ డి.ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో రాయవరంలో ధర్నా చేశారు. కార్మికులకు వ్యతిరేకంగా, కార్పొరేట్లకు అనుకూలంగా పనిచేసే ప్రభుత్వాలు మనజాలవని సీఐటీయూ నేతలు పేర్కొన్నారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, నేషనల్ హెల్త్ మిషన్, వెలుగు, ఉపాధి హామీ, మెప్మా, సమగ్ర శిక్ష, ఆయుష్, సేంద్రియ వ్యవసాయం,108,1 04 తదితర అన్ని పథకాల కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించడం లేదన్నారు. వీరికి కనీస వేతనాలు చెల్లించడం లేదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను కూడా గత ప్రభుత్వాలు నిలిపి వేశాయన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, కంటింజెంట్, పార్ట్ టైమ్, గెస్ట్ తదితర కార్మికులకు ఉద్యోగ భద్రత లేదని, కూటమి ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలని, ప్రైవేటీకరణను, నేషనల్ మానిటైజేషన్ ఆఫ్ పైప్‌లైన్స్‌ను ఆపాలని, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, వెలుగు, ఉపాధి హామీ, సమగ్ర శిక్ష తదితర అన్ని పథకాల కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. నెలకు కనీస వేతనంగా రూ.26వేలు వంతున నిర్ణయించి అమలు చేయాలని, పెన్షనల్ వంటి సామాజిక భద్రత సౌకర్యాలు కల్పించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు ఆర్వీ కృష్ణారావుకు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయు నేతలు జి.దుర్గ, వివిధ రంగాలకు చెందిన అసంఘటిత రంగ కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

వేధింపులకు గురి చేస్తే ఉద్యమిస్తాం

కపిలేశ్వరపురం: కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ వేధింపులు పెరిగాయని, మానుకోకపోతే ఉద్యమిస్తామని మండలంలోని పలు గ్రామాల చిరుద్యోగులు అన్నారు. కోర్కెలు దినోత్సవం సందర్భంగా సీఐటీయూ పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, డ్వాక్రా యానిమేటర్లు ధర్నా చేశారు. మానవహారంగా నిలబడి డిమాండ్లపై నినాదాలు చేశారు. ఆయా సంఘాల నాయకులు ఎం.బేబి. ఎం.జానకీదేవి, ఎం.నాగరత్నం, ఐకే లక్ష్మి, ఎం.హేమలత, అనసూయ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక క్షేత్ర స్థాయిలో చిరుద్యోగులను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల జరిగిన ఘటనలు ఇందుకు నిదర్శనమన్నారు. తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ రాజరాజేశ్వరికి అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


రాయవరంలో తహసీల్దార్ కృష్ణారావుకు వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నేత ఆదిలక్ష్మి తదితరులు


కపిలేశ్వరపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న చిరుద్యోగులు

భక్తి సాగరంలో ఓలలాడించిన శ్రీరామనామ సప్తాహం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసిన ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద బుధవారం 7వ శ్రీరామ నామ సప్తాహం భక్తులను భక్తి సాగరంలో ఓలలాడించింది. విఘ్నేశ్వర పూజ, కలశస్థాపనతో సప్తాహం ప్రారంభించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తల్లిదండ్రులు వాసంశెట్టి సత్యం, కృష్ణకుమారి, భార్య సునీత, పిల్లలు సత్య దివిత, సత్య దీక్షిత పూజల్లో పాల్గొన్నారు. వారిని ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం సభ్యులు దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం దివంగత భజన గురువు మంచెం నాగేశ్వరరావు స్మృత్యర్థం ఆయన కుమారుడు మంచెం ఆంజనేయమూర్తి(చిన్నబాబు) సౌజన్యంతో భక్తి సంకీర్తనాచార్య, సంగీత రత్నాకర బిరుదాంకితులు, సువర్ణసింహ తలాటం, సువర్ణ రుద్రాక్షమాల సన్మానితుడు అయిన అమలాపురానికి చెందిన మట్టపర్తి చంద్రశేఖర్ భజన బృందం, దివంగత ఏలూరి పాండురంగారావు స్మృత్యర్థం వారి కుమారుల సౌజన్యంతో సంగీత సర్వనిధి, నేషనల్ అవార్డు గ్రహీత చిరతపూడికి చెందిన రాజేష్ స్వామి భజన బృందం, వేగాయమ్మపేటకు చెందిన ఆదిమూలం బాబూరావు, సత్యవతి దంపతుల సౌజన్యంతో రాజమహేంద్రవరం, దంగేరులకు చెందిన శ్రీలలితా పరమేశ్వరి మహిళా బృందాలు వీనుల విందుగా భక్తి గీతాలు ఆలపించి అలరించారు. భజన బృందాలు, భక్తులకు ద్రాక్షారామకు చెందిన పెట్టా శంకరరావు కుటుంబ సభ్యులు అన్న ప్రసాదం అందజేశారు.


శ్రీరామనామ సప్తాహంలో భక్తి గీతాలు ఆలపిస్తున్న మట్టపర్తి చంద్రశేఖర్ భజన బృందం


మంత్రి సుభాష్ కుటుంబ సభ్యులకు జ్ఞాపిక అందజేస్తున్న ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం

సమస్యలు పరిష్కరించాలి

రామచంద్రపురం రూరల్: సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకన్నబాబు ఆధ్వర్యంలో ఉద్యోగులు మండల విద్యా వనరుల కేంద్రం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. మే, జూన్ నెలల వేతనాలు విడుదల చేయాలని, సమ్మె కాలం జీతం, సమ్మెల అగ్రిమెంట్ అమలు చేయాలని, హెచ్ఆర్ పాలసీ, ఎంటీఎస్ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత, ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, 23 శాతం పెంపుదల లేని విభాగాలకు వెంటనే వేతనాలు పెంచాలని, గెస్ట్, డైలీ వైజ్ సిబ్బందిని రెన్యువల్ చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చాలని, రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, గ్రాడ్యుటీ, పింఛన్ సదుపాయాలు కల్పించాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అనంతరం ఎంఈఓలు మానుపూడి శ్రీనివాస్, వాసంశెట్టి నాగేశ్వరిలకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్, అకౌంటెంట్, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.


ఎంఈఓలకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించాలి

కాజులూరు: వ్యవసాయ రంగంలో అందుబాటులోకి వస్తున్న సాంకేతిక పరిజ్ఞానంపై రైతులలో అవగాహన పెంపొందించి పూర్తి స్థాయిలో వాటిని సద్వినియోగం చేసుకునేలా వ్యవసాయ సహాయకులు కృషి చెయ్యాలని జిల్లా వ్యవసాయాధికారి (జేడీఏ) ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం గొల్లపాలెంలో కరప ఏడీఏ కె.బాబూరావు ఆధ్వర్యంలో కాజులూరు, తాళ్లరేవు మండల గ్రామాలకు చెందిన వ్యవసాయ సహాయకులు (వీఏఏ)లకు వ్యవసాయ నూతన పద్ధతులపై శిక్షణ తరగుతులు నిర్వహించారు. జేడీఏ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆధునిక, సాంకేతిక సలహాలతో రైతుల నికర ఆదాయం పెరిగేలా వీఏఏలు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు సమీకృత వ్యవసాయాన్ని, పొలంబడులను ఉపయోగించుకోవాలన్నారు. రైతులకు ఎరువులు, పురుగుమందుల వాడకంలో తగిన సలహాలు, సూచనలు ఇస్తూ సాగు ఖర్చు తగ్గించాలన్నారు. కార్యక్రమంలో మండల ఏవో వి.అశోక్, పలువురు వ్యవసాయాధికారులు, వీఏఏలు పాల్గొన్నారు.


గొల్లపాలెంలో వీఏఏలకు వ్యవసాయ ఆధునిక పద్ధతులపై శిక్షణ ఇస్తున్న జేడీఏ విజయ్‌కుమార్

మహిళా శక్తి సంఘాలను బలోపేతం చేయాలి

- స్టేట్ రీసోర్స్‌పర్సన్ అజయ్
- గ్రామ సంఘాల అధ్యక్షులకు అవగాహన సదస్సు

రాయవరం: మహిళా శక్తి సంఘాలను బలోపేతం చేసేలా గ్రామ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృషి చేయాలని స్టేట్ రీసోర్స్‌పర్సన్ అజయ్ కోరారు. గ్రామ సంఘాల అధ్యక్షులకు రెండు రోజుల అవగాహనా సదస్సును మండల మహిళా సమాఖ్య కార్యాలయ సమావేశపు హాల్లో బుధవారం నిర్వహించారు. ఏపీఎం మహ్మద్ నాజర్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో గ్రామ సంఘాల పరిధిలోని మహిళా శక్తి సంఘాలను చైతన్యం చేయాలన్నారు. ముఖ్యంగా పొదుపు నిర్వహణ, రికార్డుల నిర్వహణ, ప్రొడక్టవిటీ యాక్టివిటీస్, తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకునే మార్గాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామ సంఘాలు తిరిగి మహిళా శక్తి సంఘాలకు అవగాహన కల్పించాలన్నారు. మండలంలో 48 మహిళా శక్తి సంఘాల అధ్యక్షులకు ఈ అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం నాజర్ హుస్సేన్ మాట్లాడుతూ మండలంలో 1,696 మహిళా శక్తి సంఘాలు ఉన్నాయని, ఈ సంఘాల ద్వారా నెలకు రూ.16.96 లక్షలు పొదుపు జరుగుతుందన్నారు. అలాగే మండలంలోని మహిళా శక్తి సంఘాలకు గత ఆర్థిక సంవత్సరంలో రూ.109.67 కోట్లు రుణాలుగా అందజేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం డయేరియాపై వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామ సంఘాల అధ్యక్షులకు అవగాహన కల్పించారు.


ఆర్థిక అంశాలపై గ్రామ సంఘాల అధ్యక్షులకు అవగాహన కల్పిస్తున్న అజయ్

సారా స్థావరంపై దాడి


సారా స్థావరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రంగంపేట: సారా తయారు చేస్తున్న స్థావరంపై స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో బృందం బుధవారం దాడి చేసింది. ఇందులో ఒకరిని అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ ఎస్.రాంబాబు తెలిపారు. జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు ఈ దాడి చేశారు. కానేడు గ్రామంలో సారా తయారు చేస్తున్న బల్లి సత్తిబాబును అరెస్టు చేసి, 35 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సుమారు వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఎస్ఈబీ ఎస్సై జి.అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకుడికి ఘనంగా వీడ్కోలు


అధ్యాపకుడు సత్యనారాయణను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ రామారావు, అధ్యాపకులు

రాయవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్ట్ తెలుగు అధ్యాపకుడిగా పని చేసి పదవీ విరమణ చేసిన చోడే సత్యనారాయణకు అధ్యాపకులు, విద్యార్థులు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రిన్సిపాల్ ఎం.రామారావు అధ్యక్షతన నిర్వహించిన అభినందన సభలో సత్యనారాయణ అంకితభావంతో అందించిన సేవలను పలువురు ప్రశంసించారు. అనంతరం సత్యనారాయణను ప్రిన్సిపాల్ రామారావు, అధ్యాపకులు దుశ్శాలువా, పూలమాల, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

మొహర్రం నాలుగో రోజు పీర్ల ఊరేగింపు

రామచంద్రపురం రూరల్: మొహర్రం సంతాప దినాలు నాలుగో రోజు బుధవారం ద్రాక్షారామలో ఇమాం రజా పంజాలో కర్ణాటక నుంచి విచ్చేసిన మత గురువు మౌలానా అలీ అస్ఘర్ ఆబేదీ సాహెబ్ మజ్లిస్ ఆలపించారు. అనంతరం ఆజా ఖానయే జహారా పంజా నుంచి పీర్లను యా అలీ, యా హుస్సేన్ నినాదాలతో యువకులు, చిన్నారులు ఊరేగించారు. ద్రాక్షారామ, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి అంజుమనే కమిటీల ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు.


ద్రాక్షారామలో పీర్లను ఊరేగిస్తున్న ముస్లింలు

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాజులూరు: ఇంజరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మండల గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు కాకినాడ ఏపీఈపీడీసీఎల్ డీఈ జి.ప్రసాద్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం మెయిన్ సబ్‌స్టేషన్‌లో ఏఈ ఎం.సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులు, ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ మండలంలోని కోలంక, నామవానిపాలెం, పొలమూరుపాడు, చలివేంద్రపాడు, గ్రామాల్లోని గృహవాసాల, ఉప్పుమిల్లి, నామవానిపాలెం, కోలంకల్లోని ఆక్వాచెరువులు, ఇండస్ట్రియల్ ఫీడర్ వినియోగదారులకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అదుపులోకి వచ్చిన డయేరియా


కాపవరంలో డయేరియా కేసులపై ఆరా తీస్తున్న రాజకుమారి

బిక్కవోలు: మండలంలోని కాపవరంలో డయేరియా అదుపులోనే ఉందని, కొత్తగా ఎలాంటి కేసులు నమోదు కాలేదని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం కాపవరం గ్రామంలో ఆయన పర్యటించారు. ఎనిమిది చోట్ల నీటి నమూనాలు సేకరించి, పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపించారన్నారు. అలాగే జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఎస్.రాజకుమారి కాపవరంలో సర్వే చేయించారు. కొత్త కేసులు నమోదు కాలేదని పీహెచ్‌సీ వైద్యాధికారి డా.విజయలక్ష్మి తెలిపారు. డీపీఓ రాంబాబు పర్యవేక్షణలో పారిశుధ్య చర్యలు నిర్వహించి, ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేశారు.

వేణును పరామర్శించిన 'పొన్నాడ'


మాజీ మంత్రి వేణును పరామర్శిస్తున్న పొన్నాడ సతీష్ తదితరులు

రామచంద్రపురం: మాతృవియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను వైఎస్సార్ సీపీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్, ఆ పార్టీ నేత పితాని బాలకృష్ణలు మాజీ ఏఎంసీ చైర్మన్ కొమరిన వీర్రాజు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, తదితరులు బుధవారం పరామర్శించి సంతాపం తెలిపారు.

అభిషేక్‌కు సత్కారం


అభిషేక్‌ను అభినందిస్తున్న జీవీ రావు తదితరులు

రామచంద్రపురం: ఉమ్మడి తూర్పుగోదావరి బ్యాడ్మింటన్ సెలక్షన్ కమ్ టోర్నమెంట్ 2024లో మోడరన్ విద్యా సంస్థలకు చెందిన బోను అభిషేక్ మూడు బంగారు పతకాలు సాధించినట్లు విద్యాసంస్థల అధినేత జీవీ రావు బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు విద్యా సంస్థల్లో అభిషేక్‌ను ఘనంగా సత్కరించారు. జీవీ రావు మాట్లాడుతూ ఈ నెల 7, 8 తేదీల్లో కొత్తపల్లి సత్యనారాయణ మెమోరియల్ తరఫున రాజమహేంద్రవరంలో జరిగిన పోటీల్లో అభిషేక్ అండర్-17లో సింగిల్స్, డబుల్స్, అలాగే అండర్-19 డబుల్స్‌లో విన్నర్‌గా నిలిచి మూడు బంగారు పతకాలతో పాటు క్రీడాభిమానుల ప్రశంసలు అందుకున్నాడని రావు తెలిపారు.

క్లుప్తంగా

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి శారద

రామచంద్రపురం: బైక్ నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద అన్నారు. పట్టణంలోని వికాస్ డిగ్రీ కళాశాలలో మండల లోక్ అదాలత్ ఆధ్వర్యంలో బుధవారం 'హెల్మెట్ ధరించడం వల్ల లాభాలు' అనే అంశంపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మైనారిటీ తీరే వరకు బైక్‌లు నడపరాదని అలా నడిపి ప్రమాదాలు చేస్తే తల్లిదండ్రులకు కూడా శిక్షలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.మురళీమోహన వెంకటరమణ, ఉపాధ్యక్షులుడు పి.సత్యనారాయణ, లోక్ అదాలత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

మండపేట: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని టౌన్ ఎస్ఐ హరికోటి శాస్త్రి అన్నారు. డ్రగ్ అవేర్నెస్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం స్థానిక విజ్ఞాన్ హైస్కూల్ ఆవరణలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ హరికోటి శాస్త్రితో పాటు అదనపు ఎస్ఐ ఎల్ నాంచారయ్యలు చెడు వ్యసనాల బారిన పడకుండా విద్యార్థులకు హితబోధ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ శాస్త్రి మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు అలవాటు పడితే వారి బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. ఎవరైనా విద్యార్థులు గంజాయికి అలవాటు పడితే వెంటనే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు లేదా తమకు తెలియపరచాలన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు ఉన్నట్టు సమాచారం ఉంటే వెంటనే తమకు తెలియపరచాలన్నారు.

ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు


పాస్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న రూబెన్

కపిలేశ్వరపురం: ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నట్టు మండల పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు అన్నారు. మండల కేంద్రం కపిలేశ్వరపురంలోని పాస్టర్స్ కమ్యూనిటీ హాల్‌లో ఫెలోషిప్ అధ్యక్షుడు రూబెన్ అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. చర్చిల నిర్వహణా తీరుపై చర్చించారు. సమావేశంలో ఫెలోషిప్ ఉపాధ్యక్షుడు ఎం.డేవిడ్‌రాజు, చీఫ్ ప్యాట్రన్ నానిబాబు, కోశాధికారి ఇమ్మానుయేల్, యెషయా, ఏసురత్నం, మోషే, ఐజాక్ క్రిస్టోఫర్, జీజీ రాజు, సత్యకుమార్, మనేష్, ధన్యకుమార్, రాజా, బర్నబాస్ పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ


ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేస్తున్న డిపో మేనేజర్

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం ఆర్టీసీ డిపోలో గురువారం డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 'ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ' నిర్వహించారు. ఈ ఏడాది జూన్ నెలలో అత్యధిక ప్రతిభ కనబరిచిన కండక్టర్లు, డ్రైవర్లను ఘనంగా సత్కరించారు. అత్యధిక ఇంధన పొదుపు సాధించిన డ్రైవర్లు కె.అమ్మన్న, డీజే నందంలకు, అదే విధంగా అధిక ఆదాయం సాధించిన కండక్టర్లు డీపీ రాజ్‌కుమార్, డీఎం రావు, కేఎస్ నారాయణలనుకు డీపీటీఓ మేడిశెట్టి శ్రీనివాసరావు పంపిన ప్రశంసాపత్రాలతో పాటు నగదు బహుమతులు అందజేసి అభినందించారు.

శాకంబరిగా నూకాంబిక అమ్మవారు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన గ్రామ దేవత నూకాంబిక అమ్మవారు బుధవారం శాకంబరి మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసంలో అమ్మవారిని ఏటా శాకంబరిగా అలంకరించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా శ్రీక్రోధ నామ సంవత్సర ఆషాఢ చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని గుప్త నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా మహిళ భక్త బృంద సభ్యులు 108 కిలోల వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ ముఖ మండపంలో భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. శాకంబరి అవతారంతో ఉన్న నూకాంబిక అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.